

# ప్రమాదం జాగ్రత్త!

## – కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

**"యువర్ ఆనర్!** షీలా చాలా అందమైన స్త్రీ. ఇద్దరు పిల్లలు తల్లి. అందమైన స్త్రీని చూడగానే, పశువులా, నీతీ న్యాయమూ, మర్చిపోయి, తన కామాన్ని తీర్చుకునేందుకు ఆ స్త్రీని ఎత్తుకుపోయి, పసిపిల్లల్ని నిర్దాక్షిణ్యంగా, అర్ధరాత్రి నిర్మానుష్యమైన ట్రంక్ రోడ్ మీద వొదిలేసి, ఆ తర్వాత ఆ స్త్రీని బలాత్కారంగా మానభంగం చేసి, ఆ స్త్రీ తనని పట్టిస్తుందేమోనని ఆ స్త్రీని చంపేసిన ముద్దాయిలాంటి రాక్షసులు సమాజంలో తిరగడం, ఒక మృగాన్ని, నరమాంసాన్ని భక్షించే పులిని, విచ్చలవిడిగా వొదిలినట్టే. మీ అనుమతితో సాక్ష్యం ప్రవేశపెట్టాను" అన్నాడు ప్రాసిక్యూటర్.

మేజిస్ట్రేటు యుగంధర్ వైపు చూశాడు. ఆరు అడుగుల మూడు అంగుళాల పొడుగున్న యుగంధర్‌కి నల్ల కోటు వొదులుగా మోకాళ్ళ కిందకి వేలాడుతోంది. కోటు సర్దుకుంటూ లేచి "యువర్ ఆనర్! ప్రాసిక్యూషన్ కేసుని చాలా క్లుప్తంగా చెప్పారు. ముద్దాయి శిఖామణి దొంగ అనీ, దోపిడీలు చేశాడనీ, వివిధ రాష్ట్రాలలో పోలీసులు అతని కోసం అరెస్టు వారంటుతో వెయ్యి కళ్ళతో కాచుకున్నారనీ డిఫెన్సు అంగీకరిస్తోంది."

యుగంధర్ ఆ మాట అనగానే అక్కడ వున్న వకీళ్ళు గుసగుసలు ప్రారంభించారు.

"క్రిమినల్ కేసులు వాదించటం అలవాటులేనిదే, పూనుకుంటే యిలాటి పొరపాటే చేస్తారు" అన్నాడు ఒక సీనియర్ క్రిమినల్ లాయర్.

"ప్రారంభంలోనే తన క్లయింట్ దొంగ అనీ దోపిడీ అనీ అంగీకరిస్తే యిక ముద్దాయి మీద జాలి ఏం వుంటుంది క్రిమినల్ లా లో, ఘటికుడనుకున్న యుగంధర్ ఇంతటి హిమాలయన్ బ్లండర్ యెందుకు చేశాడు?" అన్నాడు యింకో లాయర్.

"కాని ముద్దాయి శిఖామణి అక్టోబర్ అయిదవ తేదీన కాదుకదా ఏ నాడూ షీలా ముఖర్జీని ఎత్తుకుపోలేదనీ, హత్యచేయలేదనీ జ్యుడిషియల్ కస్టడీలో వున్నా పోలీసులు మభ్యపరిచి, ముద్దాయినించి కన్ఫెషనల్ స్టేట్‌మెంట్ తీసుకున్నారనీ నిరూపిస్తుంది. మై లెర్నడ్ ఫ్రెండ్ ప్రాసిక్యూటర్ ప్రారంభోపన్యాసంలో ముఖ్యమైన అంశాలు అసలు పేర్కొనలేదు. షీలా ముఖర్జీ చాల అందమైన స్త్రీ. డిఫెన్సు ఆ విషయం అంగీకరిస్తుంది. ముద్దాయి శిఖామణి షీలా ముఖర్జీని ఆకస్మికంగా ఓ థియేటర్లో చూసి, అప్పటికప్పుడు ఆమెని ఎత్తుకుపోయి మానభంగం చెయ్యాలని సంకల్పించుకున్నాడా లేక అంతకు ముందే ఆమెని చూసి, ఆమెని ఎత్తుకుపోయి మానభంగం చెయ్యాలని సంకల్పించుకున్నాడా? ప్రాసిక్యూషన్ ప్రవేశపెడ్తానన్న సాక్ష్యాన్ని బట్టి, ముద్దాయికి, షీలా ముఖర్జీ భర్త పేరు తెలుసు. వింగ్ కమాండర్ ముఖర్జీ ప్రమాదంలో గాయపడ్డారని చెప్పి ఆమెని కారు యెక్కించుకున్నాడు. అంతేకాదు, ఈ అఘాయిత్యం చెయ్యడానికే కారు దొంగలించాడా? దొంగలించి, అవకాశం కోసం కాచుకున్నాడా? అయితే షీలా ముఖర్జీకి, ముద్దాయి శిఖామణికీ పూర్వ పరిచయం వుందా! యువర్ ఆనర్ మరి ఒక విషయం. ముద్దాయి శిఖామణి ఒక్కడేనా, కారులో యింకెవరయినా వున్నారా? షీలా ముఖర్జీని ముద్దాయి ఒక్కడే

కారు ఎక్కించుకుని వుంటే, అతనే కారు డ్రయివ్ చేస్తూ వుండి వుండాలి. అటువంటప్పుడు అతను ఆమెకి మత్తుమందు ఎలా యివ్వగలడు? ప్రాసిక్యూషన్ కేసులోవున్న లోపాలు కొన్ని మాత్రమే వివరించాను. ఇక డిఫెన్సు తరపున ముద్దాయి శిఖామణి అక్టోబర్ అయిదవ తేదీ బొంబాయిలో లేడనీ, అక్టోబర్ అయిదవ తేదీ రాత్రి, అర్ధరాత్రి, అంటే దాదాపు హత్య జరిగిన సమయానికి మద్రాసులో తన యింట్లో వున్నాడనీ, డిఫెన్సు నిరూపిస్తుంది. హత్య జరిగిన సమయానికి, ముద్దాయి హత్య జరిగిన స్థలానికి దాదాపు ఎనిమిది వందల మైళ్ళ దూరంలో వున్నాడని నిరూపిస్తే, ముద్దాయి హత్య చెయ్యలేదని నిరూపించినట్టేగా. కనుక ప్రాసిక్యూషన్, సృష్టించబడ్డ రకరకాల కల్పిత సాక్ష్యాలతో కోర్టువారి కాలం వృధా చెయ్యకుండా, ముందు యీ యదార్థం నిరూపించేందుకు అవకాశం యివ్వమని కోరుతున్నాను" అని యుగంధర్ వెనక్కి తిరిగాడు.

మళ్ళీ కోర్టులో గుసగుసలు.

"నేను చెప్పలేదూ, ఏదో యిలాటి సాక్ష్యం, ప్రాసిక్యూషన్‌ని తల్లకిందులు చేసేది లేనిదే యుగంధర్ రంగంలోకి దిగడు" అన్నాడు ఒక లాయర్.

"అటువంటి సాక్ష్యం వుంటే, విచారించకుండా పోలీసులు కేసు ఫైలు చేస్తారా? అదీగాక మిగతా సాక్ష్యం విషయం?" అన్నాడు చాలా కేసులు ఓడిపోయిన ఒక క్రిమినల్ లాయర్.

మేజిస్ట్రేటు గడియారంవైపు చూశారు. "విచారణ రేపటికి వాయిదా వేయబడింది" అని లేచాడు.

23

తను కోర్టులోంచి బయటకు వెళుతున్నప్పుడు తనని పట్టుకుంటారని యుగంధర్‌కి తెలుసు. అంతేకాదు. "షూట్ ఆన్ సైట్" అనే ఆజ్ఞ కూడా వుంది. కోర్టు ఆవరణలో వున్నంతకాలము, తనని యెవరూ ఏమీ చెయ్యలేరని యుగంధర్‌కి తెలుసు. తిన్నగా మేజిస్ట్రేటు గదిలోకి వెళ్ళాడు. మేజిస్ట్రేటు అప్పుడే బయలుదేరబోతున్నారు.

"ఏమిటి?" అడిగాడు మేజిస్ట్రేటు.

"వివరాలు చెప్పడానికి యిది సమయంకాదు, వ్యవధిలేదు. ఈ కోర్టులోంచి నేను బయటికి వెళితే నన్ను చంపేస్తారు"

"అటువంటి భయంవున్న పక్షంలో, కోర్టులోనే అర్జీ దాఖలు చెయ్యవలసింది" అన్నారు మేజిస్ట్రేటు.

"అటువంటి అర్జీవల్ల ప్రయోజనం వుంటుందనిపిస్తే చేసేవాడ్ని. ఈ కేసు పూర్తి అయ్యేలోపున మీకు వివరాలు తెలుస్తాయి. నాకు ఒక సహాయం కావాలి."

"ఏమిటది?" అడిగాడు మేజిస్ట్రేటు.

"మీ జవాను వేషంలో, మీకూడా, మీ కారులో నన్ను తీసుకుని వెళ్ళండి తోవలో నేను దిగేస్తాను"

"వాట్?"

ప్లీజ్.. నా గురించి మీకు తెలుసు" అన్నాడు యుగంధర్. మేజిస్ట్రేటు నవ్వుతూ తల ఊపాడు.

మేజిస్ట్రేటు వెనకే, దర్వాన్ వేషంలో ఫైల్సు పట్టుకుని వెళ్తున్న మనిషి డిటెక్టివ్ యుగంధర్ అని ఎవరికీ తెలియదు. వెయ్యి కళ్ళతో కనిపెట్టుకుని, యుగంధర్ కోసం కాచుకున్న, పోలీసులు సి.ఐ.డీలు మిలిటరీ యింటలిజెన్స్ యుగంధర్ కోసం కాచుకునే వున్నారు. యుగంధర్ వెళ్ళిపోయాడు.

ఆటోని ఆగమన్నాడు రాజు. ఆటో ఆగింది. రాజు దిగి రోడ్ పక్కగా నిలుచున్నాడు. వెనక వస్తున్న ఆటో వేగం తగ్గింది. దగ్గరికి వచ్చింది. అందులోంచి యిద్దరు దిగారు. కాచుకున్నాడు రాజు. వాళ్ళు ఆటో దిగగానే, ఒక్క యెగురు యెగిరి, చెరొక్కణ్ణి చెరొకవైపు, డొక్కలో బూట్సు కాళ్ళతో తన్నాడు. ఆటో డ్రయివరు ఏం జరుగుతున్నదో గ్రహించేలోపున రాజు వాళ్ళిద్దర్నీ స్పృహపోయేట్టు కొట్టాడు. ఇంకో గంట తర్వాత కానీ వాళ్ళకి స్పృహరాదు. "వీళ్ళిద్దరూ పచ్చి రౌడీలు. నేను పోలీసు ఆఫీసర్ని. వీళ్ళిద్దర్నీ సిటీ పోలీస్ ఆఫీసుకి తీసుకెళ్ళి అప్పజెప్పు" అని యిద్దర్నీ ఆటోలోకి తోసి, డ్రయివర్ చేతిలో ఇరవై రూపాయలు పెట్టాడు రాజు. తర్వాత తనూ ఆటో యెక్కి, విమానాశ్రయానికి అరఫర్లాంగు దూరంలో దిగి, "నాకు యిక్కడ పనుంది. అరగంట కాచుకో నేను అరగంటలో తిరిగి రాకపోతే నువ్వు వెళ్ళిపో" అని ఆ డ్రయివర్‌కి డబ్బు యిచ్చాడు. కాలి నడకన విమానాశ్రయానికి వెళ్ళాడు.

24

"వెరీగుడ్ నేను యీ హోటల్లో వున్నట్లు యెవరికీ తెలియదు. మీరు కూడా తగు జాగ్రత్తలు తీసుకుని యిక్కడికి వచ్చి వుంటారని అనుకుంటాను"అన్నాడు యుగంధర్ రాజునీ, కాత్యానీ చూసి. వాళ్ళు తలలు వూపారు.

"ప్రాసిక్యూషన్ కేసు సాక్ష్యాలు ప్రవేశపెట్టడం ఇంకా నాలుగు రోజులు పడుతుంది. ఈ నాలుగు రోజులూ పోలీసుల కళ్ళల్లో దుమ్ముకొట్టి, నేను కోర్టుకి వెళ్ళి తిరిగి రావాలి. అవి నా పాట్లు. రాధ ఎక్కడున్నది?" అడిగాడు యుగంధర్. రాజు చెప్పాడు.

"డిఫెన్సు సాక్షిగా రాధ బోను యెక్కవలసి వుంటుంది. అంతేకాదు. డాక్టర్ పంకజరావు, కరుప్పన్‌లని డిఫెన్స్ సాక్షులుగా, హోస్టయిల్ సాక్షులుగా అయినా సరే పిలిపించమని, రేపే కోర్టులో అర్జీలు దాఖలు చేస్తాను. డిఫెన్సు కేసు ప్రారంభం అయి, పూర్తి అయ్యేలోపున –"

"అయేలోపున" అడిగాడు రాజు.

"రాజూ! నువ్వూ కాత్యా కలసి వెళ్ళండి. చాలా ప్రమాదం. జాగ్రత్త. మొట్టమొదటిసారి అధికారులకి వ్యతిరేకంగా మనం వ్యవహరిస్తున్నాం. నన్ను కాల్చి చంపివెయ్యమన్న అధికారులు నిన్నూ, కాత్యాని చంపడానికి క్షణం వెనుకాడరు."

"మేము ఏం చెయ్యాలి?" అడిగాడు రాజు.

"జాగ్రత్తగా వినండి. ఇది కేవలం నా వూహ. కానీ, వూహకి వెనక హేతువాదం వుంది" అని యుగంధర్ రాజుకీ, కాత్యాకీ చెయ్యవలసిన పనులు వివరంగా చెప్పాడు.

చేతిలో ఒక మూట. పోలీస్ కానిస్టేబుల్ డ్రస్‌లో వున్నాడు యుగంధర్. మేజిస్ట్రేటు కోర్టు దగ్గర కాపలా వున్న పోలీసులు యుగంధర్ విషయం పట్టించుకోలేదు. యుగంధర్ తిన్నగా లాయర్లు కూర్చునే గదిలోకి వెళ్ళాడు.

"ఈ రోజు యుగంధర్ ఎలా వస్తాడు? ఎలా తప్పించుకుంటాడు?" అంటున్నాడు ఎ.సి. అంతలో నల్లకోటు వేసుకుని ఠీవిగా కోర్టు గదిలోకి వెళ్ళాడు యుగంధర్.

"యుగంధర్! మంత్రాలూ, మాయజాలమూ తెలుసా మీకు?" అడిగాడు కమీషనర్. యుగంధర్ నవ్వుతూ, "న్యాయం, ధర్మం కోస్మ పోరాడుతున్నప్పుడు, మంత్రాలూ, మాయలూ అవసరంలేదు. దైవబలం, అనుగ్రహం వుంటుంది" అన్నాడు.

"ఈ రోజు కూడా తప్పించుకుని పోగలరా?" అడిగాడు ఏ.సి

"ప్రయత్నిస్తాను" అన్నాడు యుగంధర్. అంతలో మేజిస్ట్రేటు వచ్చారు.

ప్రాసిక్యూటర్ లేచి నిలుచున్నాడు. "ప్రాసిక్యూషన్ ప్రారంభ ఉపన్యాసంలో ఉదహరించినట్లు శిఖామణి, శ్రీమతి షీలాముఖర్జీని హత్య చేశాడని నిరూపించేందుకు కావలసిన సాక్ష్యం ప్రవేశపెట్టేందుకు కోర్టువారి అనుమతి కోరుతున్నాను"

"యు కెన్ ప్రొసీడ్" అన్నాడు మేజిస్ట్రేటు.

"ప్రప్రథమంగా శిఖామణిని అరెస్టు చేసిన పోలీసు ఉద్యోగి."

25

బజర్ చప్పుడు కాగానే, వింగ్ కమాండర్ ముఖర్జీ వెళ్ళి తలుపు తీశాడు. తివాసీ మీద కూర్చుని పుస్తకం చదువుకుంటున్న పిల్లలు, తలుపువైపు తేరిపార చూస్తున్నారు.

"సారీ! ఈమె నా సెక్రటరీ. ఎల్లుండి మీ సాక్ష్యం కోర్టులో. వివరాలన్నీ సరిగ్గా జ్ఞాపకం వున్నాయా అని మరొకసారి జ్ఞాపకం చేసేందుకు ప్రాసిక్యూటర్ పంపారు" అన్నాడు మారువేషంలో వున్న రాజు.

"ఫోన్ చేశారుగా. కూర్చోండి" అని విస్కీ గ్లాసు పక్కన తెచ్చి పెట్టుకుని, యింకో గ్లాసు తెచ్చుకున్నాడు. "నో థాంక్ యు" అన్నాడు రాజు.

ఒక గుక్క తాగి "నారాయణస్వామి, పై అధికారులు, అందరూ చెపితే, ముందు అంగీకరించాను కానీ యిప్పుడు"

"ఇప్పుడు?" అడిగాడు రాజు.

"ఒక నిర్దోషిని దొంగ సాక్ష్యం చెప్పి, ఉరికంబం యెక్కించడానికి నా అంతఃకరణ అంగీకరించడంలేదు. ఈ పసిపిల్లల మొహాలు చూస్తున్నకొద్దీ, అసలు నేరం చేసినవాడ్ని వొదిలిపెట్టి, నిర్దోషికి శిక్ష వేయించడంలో నేను తోడ్పడితే నా షీల ఆత్మ" అని యింకో గుక్క విస్కీ తాగాడు.

రాజు వూపిరి బిగపట్టాడు. కాత్యా రహస్యమైఅన్ టేప్రికార్డర్ ఎప్పుడో స్విచ్ ఆన్ చేసింది .సంభాషణ అంతా రికార్డు అవుతోంది.

"కేసు యింత దూరం వచ్చాక, అధికారపూర్వకంగా శిఖామణి హంతకుడని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత"

"అదే, అందుకే, మరీ ఆలస్యం అయ్యే ముందు" ముఖర్జీ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. రాజు లేచి వెళ్ళి, తనూ, గ్లాసులో విస్కీ పోసుకుని ముఖర్జీ గ్లాసులో యింకో పెగ్ విస్కీ పోసి, "తీసుకోండి! మనస్సు కొంత శాంతినిస్తుంది" అన్నాడు.

"ఈ మనస్సుకి శాంతా? ఎలా అసలు హంతకులు" అన్నాడు పళ్ళు పటపట కొరుకుతూ ముఖర్జీ.

"కమాండర్ నేను చాలా చిన్న ఉద్యోగిని. ప్రభుత్వం దృక్పథం గురించి నాకు వివరంగా తెలియదు. కానీ, తగిన కారణం లేనిదే"

"అవును. కారణం చెప్పారు. అప్పట్లో నేనూ అంగీకరించాను. కానీ ఇప్పుడు ఆమోదించలేకుండా వున్నాను. నేను బోనులోకి వచ్చి నిలబడ్డ తర్వాత, అబద్ధం చెప్పలేక"

"గుడ్ గాడ్! ప్రాసిక్యూషన్ కేసు తలకిందులవుతుంది" అన్నది కాత్యా.

"మిస్టర్ ముఖర్జీ అసలు మీ అంతరాత్మని బాధిస్తున్నది యేమిటో చెప్పండి. ప్రాసిక్యూషన్ తరఫున ఉద్యోగిగా కాక, ఒక మిత్రుడిగా వింటాను."

అప్పటికే బాగా తగిన ముఖర్జీ చెప్పడం ప్రారంభించాడు.

టేప్ రికార్డర్ మీద అంతా రికార్డు చేసింది కాత్యా.

మేజర్ భట్టాచార్య ఒంటిగా హాల్లో కూర్చుని టి.వి చూస్తున్నాడు. ఆయనకు వివాహం కాలేదు. సంసారం లేదు.

ఆర్డర్లీ వచ్చి "మీకోసం ఎవరో వచ్చారు సార్" అన్నాడు.

"రమ్మను" చెప్పాడు భట్టాచార్య పరధ్యానంగా.

"కూర్చోండి" అని, టి.వి ఆపేసి "ఎస్?" అడిగాడు. ఆర్డర్లీ డ్రింక్స్ తీసుకుని వచ్చేందుకు లోపలికి వెళ్ళాడు.

రాజు గొంతు సవరించుకుని తన అసలు కంఠస్వరంతో "నన్ను గుర్తుపట్టలేదా?" అడిగాడు.

భట్టాచార్య మొహం పాలిపోయింది "మిస్టర్ రాజూ! మనం పూర్వం స్నేహితులం. నిజమే కానీ ఇప్పుడు మీరూ, యుగంధర్ ప్రభుత్వానికి విరోధులు. మీతో"

"ఉష్" అన్నాడు రాజు. ఆర్డర్లీ డ్రింక్స్ బల్లమీద పెట్టి వెళ్ళాడు.

"భట్టాచార్యా! మనం స్నేహితులం అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో అయినా నేనూ, యుగంధరు దేశానికి హాని తలపెట్టగలం అని మీరు వూహించగలరా?" అడిగాడు రాజు.

"అదే ఆశ్చర్యపోయాను. ఇంకా నమ్మలేకుండా వున్నాను" అన్నాడు మేజర్.

"అసలు విషయం వివరంగా మీకు చెప్పానంటే అర్థం అవుతుంది."

"చెప్పండి" అడిగాడు మేజర్.

"చెపుతాను. ముందు ఏదో మిషమీద మీ ఆర్డర్లీని యింట్లోనించి బయటకు పంపగలరా?" అడిగాడు రాజు.

భట్టాచార్య నవ్వి "అదేమీ కష్టంకాదు" అని ఆర్డర్లీని పిలిచి "నువ్వు నీ బావమరిదిని చూడటానికి వెళ్ళాలని అన్నావు. ఎవరూ తోడులేక నీకు సెలవు యివ్వలేదు. ఇప్పుడు వెళ్ళవచ్చు. తీరికగా రా" అన్నాడు.

"పొద్దున రావచ్చా సార్"

"ఆఁ!"

ఆ ఆర్డర్లీ వెళ్ళిపోయాడు. రాజు చెప్పిన విషయాలన్నీ భట్టాచార్య ఓపికతో విన్నాడు. "మిస్ట రాజూ ఐ యామ్ సారీ. నేనేమీ సహాయం చెయ్యలేను. నాకు పై అధికారులనుంచీ ఆర్డర్స్" అంటున్నాడు, రాజు చేతిలో పిస్తోలు చూసి "ఇదేమిటి?" అడిగాడు.

"భయపడకండి మేజర్. మీ ప్రాణం తీసేటంతటి ఘాతకుడ్ని కాను నేను" అంటున్నాడు, అంతలో వెనకనించి కాత్యా వచ్చి మేజర్ ముక్కుకి మత్తుమందుతో తడిపిన జేబు రుమాల అదిమి పెట్టింది. రెండు నిమిషాలు గిలగిలలాడి భట్టాచార్య స్పృహ తప్పి పడిపోయాడు.

"త్వరగా, కాత్యా!" అన్నాడు రాజు. ఇద్దరూ కలిసి భట్టాచార్య చేతులూ, కాళ్ళూ కట్టేసి పడకగదిలోకి తీసుకెళ్ళి పడుకోపెట్టారు. తరవాత రాజు మేజర్‌కి ఒక యింజక్షన్ యిచ్చాడు. కనీసం యిరవై నాలుగు గంటల సేపు స్పృహరాదు. "నువ్వు యిక్కడే వుండు. నేను తిరిగి వచ్చేంతవరకు" అని చెప్పి, మేకప్ బాక్స్ తెరిచి రాజు మళ్ళీ వేషం మార్చుకోవడం మెదలుపెట్టాడు. సరిగ్గా భట్టాచార్యలాగా తయారయ్యాడు. తెల్లారింది. ఆర్డర్లీ వచ్చాడు. రాజుని చూసి భట్టాచార్య అనుకున్నాడు.

"నువ్వు యిక్కడే వుండు. పడకగదిలోకి వెళ్ళక. రాత్రి వచ్చాడే అతను వెళ్ళిపోయాడు. ఆమె" ఒక నవ్వు నవ్వాడు రాజు.

"యస్ సర్. అర్థమయింది" అన్నాడు ఆర్డర్లీ ఒక నవ్వు నవ్వుతూ.

"పడకగదిలో వుంది. అటు వెళ్ళక" అని రాజు మేజర్ జీపు తనే డ్రయివ్ చేసుకుంటూ బయలుదేరాడు.

26

"యువర్ ఆనర్ ముద్దాయి శిఖామణి పారడయిజ్ థియేటర్‌లో షీలా ముఖర్జీని కలుసుకున్నట్టు, ఐస్‌క్రీమ్ పార్లర్ యజమాని ద్వారా నిరూపించాము. దొంగలింపబడిన అంబాసిడర్ కారు స్టీరింగ్ వీలు మీద, తలుపు మీద ముద్దాయి శిఖామణి వేలిముద్రలు వున్నట్టు నిపుణుల ద్వారా నిరూపించాము. షీలా ముఖర్జీ శవం కనిపించిన ప్రదేశంలో ముద్దాయి శిఖామణిని చూసినట్టు, నలుగురు నిష్పాక్షికమైన సాక్షుల చేత చెప్పించాము. ముద్దాయి, షీలా ముఖర్జీని హత్య చేసినట్టు యింతకన్నా బలమైన సాక్ష్యం అనవసరం. యువర్ ఆనర్ ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టానన్న సాక్ష్యం అంతా ప్రవేశపెట్టలేదు. ఎఫ్.ఐ.ఆర్.లో (ఫస్ట్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్టు) ముద్దాయి శిఖామణి కూడా కరుప్పన్ అనే అతను వున్నట్టు అభియోగం చెయ్యబడింది. కరుప్పన్ అనే అతను వున్నట్టు, ఆ కరుప్పన్ సహాయంతోనే ఈ దారుణహత్య చేసినట్టు అభియోగం చెయ్యబడింది. కరుప్పన్ విషయమే ప్రాసిక్యూషన్ ప్రస్తావించలేదు. అంతేకాదు. షీలాముఖర్జీని ఎత్తుకుపోవడానికి, హత్య చెయ్యడానికి, ముద్దాయికి ఎవరి సహాయమూ వున్నట్టు ప్రాసిక్యూషన్ చెప్పలేదు. కనుక ఎఫ్.ఐ.ఆర్ లో వున్నదానికీ ప్రసిక్యూషన్ సాక్ష్యానికీ సంబంధంలేదు. ఈ ఒక్క లోపం వల్లనే ముద్దాయి నిర్దోషి అని నిర్ణయించమ్ము" అన్నాడు యుగంధర్.

"యువర్ ఆనర్! ముద్దాయి శిఖామణికి తోడుదొంగ అయిన కరుప్పన్ వేలూరు జైలులో యింకో నేరానికి శిక్ష అనుభవిస్తున్నాడు. ప్రాసిక్యూషన్ సాక్షిగా కరుప్పన్‌ని ప్రవేశపెట్టాలనే నిశ్చయించుకున్నాము. కానీ, ఈలోగా కరుప్పన్ జైలునించి విడుదలై పరారయ్యాడు. ఈ విషయం మైలర్నడ్ ఫ్రెండ్ డిఫెన్సు కౌన్సిలుకు కూడా తెలుసు.

"కరుప్పన్‌ని డిఫెన్సు సాక్షిగా కూడా మైలర్నడ్ ఫ్రెండ్ పేర్కొన్నాడు. కరుప్పన్‌ని డిఫెన్సు సాక్షిగా ప్రవేశపెట్టడానికి ప్రాసిక్యూషన్‌కి ఎటువంటి అభ్యంతరమూ లేదు" అన్నాడు ప్రాసిక్యూటర్.

"అభ్యంతరం తోసి పుచ్చాను. ప్రొసీడ్" అన్నాడు మేజిస్ట్రేటు.

"ప్రాసిక్యూషన్ సాక్షిగా షీలా ముఖర్జీ భర్త వింగ్ కమాండర్ ముఖర్జీని పిలుస్తున్నాము."

కోర్టులో సంచలనం. తీవిగా బోనువైపు వస్తున్న ముఖర్జీని వెయ్యి కళ్ళతో చూస్తున్నారు.

ఆర్మీ స్థానిక హెడ్ క్వార్టర్స్‌కి మేజర్ భట్టాచార్య వేషంలో వచ్చిన రాజుని చూసి యెవరూ అనుమానించలేదు. అంతకుముందు ఒకటి రెండుసార్లు రాజు మేజర్‌ని ఆ గదిలో కలుసుకోవడం వల్ల, ఏ గదికి వెళ్ళవలసిందీ తెలుసు. మేజర్ ఆనంద్‌తో రాజుకి ముఖ పరిచయం వుంది. మేజర్ ఆనంద్, భట్టాచార్య మిత్రులు అయ్యుండాలి. తను మేజర్ ఆనంద్‌ని మోసగించగలడా! తనే భట్టాచార్య అని నమ్మించగలడా! ఆలోచిస్తూ అయిదు నిమిషాలు గడిపాడు రాజు. తరువాత ఒక నిశ్చయానికి వచ్చి టెలిఫోను తీసి "కనెక్ట్ మీ టు మేజర్ ఆనంద్" అన్నాడు రాజు.

"హల్లో"

"హల్లో మేజర్! నేను భట్టాచార్యని."

"గుడ్ మార్నింగ్. ఏమిటి విశేషం?" అడిగాడు ఆనంద్.

"షీలా ముఖర్జీ కేసులో వింగ్ కమాండర్ ముఖర్జీ సాక్ష్యం యిస్తున్నారు."

"అవును. విన్నాను. కోర్టుకి వెళదాం అనుకున్నాను. తీరికలేదు."

"మేజర్ నాకు డిపార్టుమెంటల్ ట్రాన్స్‌ఫర్ వచ్చింది."

"అలాగా! ప్రమోషనా?"

"కాదు. ఇంటలిజెన్స్‌కి"

"వెరీగుడ్ విష్ యు గుడ్ లక్."

"శిఖామణి తరపున వాదించడానికి డిటెక్టివ్ యుగంధర్ పూనుకున్నారని తెలుసా?"

"తెలుసు. ఏం?"

"ఆ యుగంధర్ ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే మనిషి. నిజం బయటపడకుండా చూడమని నాకు ఆర్డర్స్ యిచ్చారు."

"నేనేం చెయ్యాలి?" అడిగాడు మేజర్ ఆనంద్.

"ఆనాడు ఎగ్జిబిషన్‌లో షీలాముఖర్జీని అవమానపరిచి ఆమె చేత చెప్పుదెబ్బలు తిన్న ఆ ముగ్గురు ఆర్మీవాళ్ళని మీరు ప్రశ్నించారా?"

"ఆ! ప్రశ్నించాను. బెదిరించాను. తమకీ హత్యకీ సంబంధం లేదని అన్నారు. వాళ్ళ మాటలు నమ్మదగినవి కావని అనిపించింది. నేను యింకా దర్యాప్తు చేసేలోపున దర్యాప్తు ఆపమని పై నుంచి ఆర్డర్స్ వచ్చాయి."

"ఆ ముగ్గురినీ యుగంధర్ పట్టుకోగలిగితే వాళ్ళ చేత నిజం కక్కిస్తారు."

"ఆ భయం లేదు. ఆ ముగ్గురూ ఎవరో నాకు తప్ప మరి ఎవరికీ తెలియదు."

"అలాగా.." రాజు ఆలోచిస్తున్నాడు. ఆ ముగ్గురూ ఎవరో ఆనంద్ చేత చెప్పించడం ఎలా?"

*(ముగింపు వచ్చేసంచికలో)*

Post your comments